

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా : 6.32 గం.
సహర్ : బుధవారం ఉ : 4.59 గం.

'పది' పరీక్షలు షురూ

పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సోమవారం ప్రథమ భాష తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు కేంద్రాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచే చేరుకోవడం కనిపించింది. ముందుగానే చేరుకుని సెంటర్, హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకున్నారు. మొదటిరోజు కావడంతో విద్యార్థుల్లో ఉత్కంఠ, భయం కనిపించింది. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా కేంద్రాల వద్దకు తరలివచ్చారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు పరీక్షా సెంటర్ల వద్ద వేచి ఉన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామని పేర్కొన్నా.. ఎక్కడా ఆలస్యంగా రాలేదు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.


సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- తొలి రోజు ప్రశాంతం
- సంగారెడ్డి జిల్లాలో 99.82 శాతం, మెదక్ జిల్లాలో 99.71 శాతం హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఉన్నతాధికారులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 18 : సంగారెడ్డి జిల్లాలో 121 కేంద్రాల్లో పదో తరగతి పరీక్ష నిర్వహించారు. తొలిరోజు సోమవారం 22,029 మంది విద్యార్థులకుగాను 21,990 మంది హాజరయ్యారు. 99.82 హాజరు శాతం నమోదైంది. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరిగినట్టు కేసు నమోదు కాలేదని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్ తనిఖీ చేశారు. సంగారెడ్డి పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ ఆర్నాల్డ్ హైస్కూల్ కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. జిన్నారం జడ్పీహెచ్ఎస్, బొంతపల్లి జడ్పీహెచ్ఎస్, మోడల్‌స్కూల్, బొల్లారం జడ్పీహెచ్ఎస్, బొల్లారం మోడల్‌స్కూల్‌లోని పరీక్షా కేంద్రాలను జిల్లా పరిశీలకుడు శివరమేశ్‌బాబు పరిశీలించారు. సంగారెడ్డి మండలంలోని రెండు, చౌటకూర్ మండలంలోని రెండు, అందోల్ మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు పరిశీలించగా, 33 కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.



మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్ : మెదక్ జిల్లావ్యాప్తంగా టెన్త్‌క్లాస్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జిల్లా పరీక్షల విభాగం అధికారి రామేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. జిల్లాలో 10,303 మంది విద్యార్థులకు 10,274 మంది హాజరయ్యారు. 99.71 శాతం హాజరు నమోదైనట్లు విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.

తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

కౌడిపల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని మెదక్ అదనపు కలెక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులన్నీ కలియదిరిగి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న సరళిని పరిశీలించారు. కేంద్రంలో సదుపాయల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. డీఈవో రాధాకిషన్ రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాల్లోని 9 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పాపన్నపేట, మనోహరాబాద్, తూప్రాన్, చేగుంటలోని 18 కేంద్రాలను సందర్శించాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలున్నా డీఈవో కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్‌రూంను 90326 25296లో సంప్రదించాలని ఆయన సూచించారు.


పరీక్ష రాసేందుకు వస్తున్న దినేష్

కాలు విరిగినా..

మెదక్ జిల్లా రేగోడు మండలం ప్యారారం గ్రామానికి చెందిన దినేష్ నారాయణఖేడ్‌లో పదో తరగతి చదువుతున్నాడు. వారం క్రితం కిందపడడంతో కాలు విరిగింది. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సోమవారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో సోదరుల సహాయంతో ఖేడ్‌లోని పరీక్షా కేంద్రానికి వచ్చి పరీక్ష రాశాడు.

-నారాయణఖేడ్


సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి


చేగుంట మండలం వడియారంలో హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది


వెల్దుర్తిలో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాళన

- త్వరలోనే సంగారెడ్డికి కొత్త డీఎంహెచ్‌వో!
- ఈసారి బదిలీ తప్పదంటున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 18 : వైద్య ఆరోగ్యశాఖలో ప్రక్షాళన మొదలైంది. రెండ్రోజుల వ్యవధిలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు డీఎంహెచ్‌వోలను మారుస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న జె.కాశీనాథ్‌ను ఈ నెల 15న బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఖైరతాబాద్ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న పుట్ల శ్రీనివాస్‌ను నియమించింది. అనంతరం ఒక్కరోజు వ్యవధిలోనే మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో జయశంకర్-భూపాలపల్లి జిల్లా అధికారి ధనసిరి శ్రీరామ్‌ను నియమించింది.

ఇక సంగారెడ్డి జిల్లా వంతు!

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల పర్వం కొనసాగుతున్న వేళ సంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో మార్పుపై చర్చ మొదలైంది. త్వరలో సంగారెడ్డి జిల్లాకు నూతన డీఎంహెచ్‌వో వస్తారనే ప్రచారం సాగుతున్నది. ఇప్పటికే సర్కారు వద్ద బదిలీ చేయాల్సిన డీఎంహెచ్‌వోల జాబితా సిద్దంగా ఉన్నట్టు ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఈ జాబితాలో సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి పేరు కూడా ఉన్నట్టు ఆ వర్గాలు వివరించాయి. అర్హత ఉండి, సీనియర్లు అయినవారినే అన్ని జిల్లాలకు డీఎంహెచ్‌వోలుగా నియమించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగానే సంగారెడ్డి డీఎంహెచ్‌వోను నియమించే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

సుదీర్ఘకాలం ఇన్‌చార్జి పాలనే..



ప్రస్తుతం సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న గాయత్రీదేవీ జిల్లాల విభజనలో భాగంగా 2016 లో సంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2017లో మోజీరామ్‌రాథోడ్ రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా వచ్చారు. ఆయన 2021 వరకు విధులు నిర్వహించారు. తదనంతరం మోజీరామ్‌రాథోడ్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి రావడంతో బదిలీ అయ్యారు. ఆ క్రమంలో మరో వైద్యాధికారి సునీల్‌కుమార్ డీఎంహెచ్‌వోగా చేరారు. ఆయన కూడా నెల రోజుల పాటు పనిచేసి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బాధ్యతలను అప్పటి ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా కొనసాగుతున్న గాయత్రీదేవీకి అప్పగించారు. అనంతరం 3-4-2021న రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా లక్ష్మణ్‌సింగ్‌ను ప్రభుత్వం నియమించినప్పటికీ ఆయనకు చార్జి ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం నిరాకరించింది. దీంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా గాయత్రీదేవీ కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆమెకు స్థానచలనం తప్పదని ఆరోగ్యశాఖ అధికార వర్గాలు తెలిపాయి. కాగా, జనవరి 30వ తేదీన సంగారెడ్డి జిల్లాకు రెగ్యులర్ డీఎంహెచ్‌వోను నియమించాలని లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కూడా ఉన్నతాధికారులు ఆరా తీసినట్టు సమాచారం. సుదీర్ఘ కాలంగా ఇక్కడే పనిచేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బదిలీ అనివార్యం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

లోక్‌సభ ఎన్నికలకు సహకరించాలి

- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్, సీ-విజిల్ యాప్
- మెదక్ నియోజకవర్గ పరిధిలో 18,12,858 మంది ఓటర్లు
- ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదు
- మెదక్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్, ఎస్పీ బాలస్వామి

7వ పేజీలో


కాల్, మీడియా సెంటర్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గడపగడపకు కాంగ్రెస్ 100 రోజుల పాలన

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 18 : కాంగ్రెస్ 100 రోజుల పాలనలో అమలు చేసిన కార్యక్రమాలను వచ్చే నెల రోజుల్లో గడపగడపకు వెళ్లి వివరించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ నేతలతో సోమవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో సమావేశమై లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియకు ఇంకా నెల రోజుల సమయం ఉన్నందున నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఉద్యోగ నియామకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కేడర్‌ను సమన్వయం చేసుకుని సురేష్‌షెట్కార్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, సంజీవరెడ్డి, లక్ష్మీకాంతారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి సురేష్‌షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, బాన్సువాడ ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్

ప్రజావాణి వినరా?

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో నిలిచిన ఫిర్యాదుల స్వీకరణ

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విరామం
- జూన్ 6 వరకు ఉండదని ప్రకటన
- అప్పటి వరకు ప్రజా సమస్యలు గాలికేనా?
- మెదక్ జిల్లాలో కొనసాగింపు


సంగారెడ్డి కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'లో అధికారులకు అందజేసేందుకు తీసుకువచ్చిన అర్జీలను చూపుతున్న బాధితులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి18: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి బ్రేక్ పడింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడిన నేపథ్యంలో నిలిపేస్తున్నామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6 వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉండదని వారు తెలిపారు. ప్రజావాణి లేదని తెలియక సోమవారం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు సంగారెడ్డి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఫిర్యాదులు తీసుకోవడం లేదని తెలియడంతో నిరాశగా వెనుదిరిగారు.

ఎన్నికల పేరిట దాదాపు రెండున్నర నెలల వరకు ప్రజావాణి నిలిపేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికే ఇంకో నెల సమయం ఉండడడంతో.. కనీసం అప్పటి వరకు ప్రజా సమస్యలు వింటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచే కోడ్ అమలులోకి వచ్చినా ఎన్నికల సంఘం నిబంధనలమేరకు ఇప్పటికే జరుగుతున్న (ఆన్‌గోయింగ్) ప్రభుత్వ కార్యక్రమాలన్నీ యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నది. ఈమేరకు ప్రజల సమస్యల పరిష్కారం 'ఆన్‌గోయింగ్' పరిధిలోకి రావా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలెవరూ రాజకీయ పార్టీలకు చెందరని, ఓటు మాత్రమే వినియోగించుకుంటారని వారు గుర్తు చేస్తున్నారు. అలాంటి వారు ఎదుర్కొనే సమస్యలు కనీసం చెప్పుకోవడానికైనా అధికారులు అనుమతించకపోతే ఎలా అని వారు అడుగుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ మొదలయ్యే వచ్చే నెల 18 నుంచి ప్రజావాణిని నిలిపివేస్తే అర్థముండేదని వారు అంటున్నారు. అప్పటి నుంచి అధికారులందరూ ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉండడంతో ప్రజావాణిని నిర్వహించడం, ప్రజల సమస్యలు పరిష్కరించడం సాధ్యమయ్యే అవకాశం ఉండదు. కానీ నోటిఫికేషన్‌కు నెల రోజుల ముందు నుంచే ప్రజావాణిని నిలిపివేయడంతో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొనే మంచినీరు, డ్రైనేజీ నిర్వహణలో ఇబ్బందులు, కరెంట్ సరఫరాలో లోపం, పంటలకు నీరందించడం, పింఛన్లు సక్రమంగా అందకపోవడం వంటి సమస్యలను గాలికి వదిలేయాల్సిందేనా అని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● మరోవైపు, మెదక్ జిల్లాలో మాత్రం సోమవారం ప్రజావాణిని యథావిధిగా నిర్వహించడం విశేషం.

మెదక్ కలెక్టరేట్‌లో ప్రజావాణికి 73 అర్జీలు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్

మెదక్ అర్బన్, మార్చి 18: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి నేరుగా వచ్చి సమస్యలను చెప్పుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. సోమవారం మెదక్ పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలున్నా ఇతరులపై ఆధారపడకుండా నేరుగా ప్రజావాణికి వచ్చి చెప్పుకోవాలని సూచించారు. ప్రజావాణిలో ధరణిలో సమస్యలపై 33, పెన్షన్ కోసం 4, ఉపాధి, ఇతర సమస్యలపై 33 దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు. ఆయా అర్జీలను వెంటనే పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం

నారాయణఖేడ్ డివిజన్‌లో నేలకొరిగిన జొన్న ● రామాయంపేట మండలంలో రాలిన వరి

నారాయణఖేడ్/రామాయంపేట, మార్చి 18: సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వరకు కురిసిన అకాలవర్షం అన్నదాతలను ఆగం చేసింది. నారాయణఖేడ్ డివిజన్‌లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురియడంతో చేతికందే దశలో ఉన్న జొన్న పంటకు, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. వంద ఎకరాలకు పైగా జొన్న పంట నేలకొరిగింది. రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. ఉమ్మడి రామాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా వడగళ్ల వర్షం కురిసింది. ఈదురుగాలులు, రాళ్ల దెబ్బకు చేతికొచ్చిన వరి నేల రాలింది. నిజాంపేట, రామాయంపేట, ధర్మారం, సుతారంపల్లి, శివైపల్లి, రైలాపూర్, గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలు అంధకారమయ్యాయి.


సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో నేలకొరిగిన జొన్నను చూపుతున్న రైతు


నిజాంపేటలో వడగళ్లు

గుమ్మడిదలలో మహిళ అదృశ్యం


మాధవి(ఫైల్)

గుమ్మడిదల, మార్చి 18: ఈ నెల 16న ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని వస్తానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా ఆమె భర్త సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన పూడూరి మాధవి అనే మహిళ ఈ నెల 16 వ తేదీన గుమ్మడిదల గ్రామం నుంచి పట్టణ ప్రాంతంలోని సూరారంలో ఉన్న మల్లారెడ్డి ఆసుపత్రికి వెళ్లి వైద్యం పరీక్షలు చేయించుకువస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి, ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో భర్త పూడురి నర్సింహులు చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. సోమవారం భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అర్ధరాత్రి చెక్‌పోస్టు తనిఖీ

● మట్టి తరలిస్తున్న 19 టిప్పర్లను పట్టుకున్న ఎస్పీ


ఎస్పీ తనిఖీ సమయంలో పట్టుబడ్డ టిప్పర్లు

నర్సాపూర్, మార్చి 18: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ సమీపంలో మల్లన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అదే సమయంలో కౌడిపల్లి మండలం నుంచి మట్టి లోడ్‌తో వస్తున్న టిప్పర్లలో ఆపి తనిఖీ చేశారు. ఈ మట్టి తరలింపు నిబంధనల మేరకు కొనసాగుతుందా.. అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయమై విచారణ చేయడానికి ఆ సమయంలో వచ్చిన 19 టిప్పర్లను మల్లన్నగుడి వద్దనే నిలిపివేయించారు. మట్టి తరలింపుపై విచారణ చేసి, అనుమతులు లేకుంటే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుఅధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక పోలీసు అధికారులను పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అక్రమ మద్యంపై దండెత్తిన మహిళలు


హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

హత్నూర, మార్చి 18: పచ్చని సంసారాలలో చిచ్చు పెడుతున్న అక్రమ మద్యం వ్యాపారాన్ని నిలిపివేయాలని కోరుతూ హత్నూర మండలంలోని పన్యాల, బడంపేట గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేయడం వల్ల యువత పెడదారి పడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా చిన్న పెద్ద తేడా లేకుండా మద్యం సేవించడం వల్ల ఇళ్లల్లో తరుచూ గొడవలు తలెత్తి ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసైన ఎంతోమంది పురుషులు మహిళల మెడలో నుంచి పుస్తెలు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామంలో పూర్తి విచారణ చేసి కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలను నిషేధించాలి వారు కోరారు. కార్యక్రమంలో స్థానిక సత్యశోధన యువజన సంఘం బాధ్యులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

బావమరిది పెళ్లికి వచ్చి బావ మృతి

కౌడిపల్లి, మార్చి 18: బావ మరిది పెళ్లి కోసం వచ్చి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన బావ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన తలారి సురేష్ వివాహం నర్సాపూర్ మండలంలోని రాంచంద్రపూర్‌లో జరిగింది. పెళ్లికి పాపన్నపేట్ మండలంలోని కొంపల్లికి చెందిన వరుడి అక్క ముక్క లక్ష్మీ, బావ చంద్రయ్య కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. రాత్రి వేళ కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్ళి వస్తానని చెప్పి వెళ్లిన చంద్రయ్య తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రిపూట చెరువు వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. సోమవారం మధ్యాహ్నం చెరువులో చంద్రయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విషం తాగి యువకుడి బలవన్మరణం


మహేష్ గౌడ్(ఫైల్)

మాసాయిపేట, మార్చి 18: జులాయిగా తిరగకుండా ఏదైనా పని చేసుకోవాలని తండ్రి మందలించడంతో ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని కుప్పలపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలగోని మహేష్‌గౌడ్ (23) జులాయిగా తిరుగుతుండటంతో తండ్రి నర్సాగౌడ్ ఏదైనా పని చేయాలని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన మహేష్‌గౌడ్ ఈ నెల 16న తన ఇంటి వద్ద విషం తాగాడు. హుటాహుటిన తూప్రాన్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు.

స్నేహితుడిని బిల్డింగ్‌పై నుంచి తోసేసి హత్య

● సిగరెట్ కోసం జరిగిన గొడవతో విషాదం



రోషన్ (ఫైల్)

కంది, మార్చి 18 : మద్యం మత్తులో సిగరెట్ కోసం గొడవపడి స్నేహితుడిని భవనం పైనుంచి తోసేసి హత్య చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అశోక్‌కుమార్, అంకిత్, రోషన్‌లు ఇంద్రకరణ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ గ్రామంలోని ఓ ఇంట్లో రెండో అంతస్తులోని పెంట్‌హౌస్‌లో అద్దెకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించిన అంకిత్, రోషన్‌లు సిగరెట్ కోసం గొడవపడ్డారు. ఈ గొడవలో అంకిత్ రోషన్‌ను పెంట్‌హౌస్ పై నుంచి కిందకు తోసేశాడు. ఈ ఘటనలో రోషన్ తల పగిలి తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన అంకిత్ అక్కడి నుంచి పరారయ్యాడు. సోమవారం ఇంటి యజమాని కొత్తపల్లి కిష్టయ్య ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వీళ్లకు ముసుగులేమిటీ?

● స్వామి వివేకానంద, చాకలి ఐలమ్మలు నేతలా?



చాకలి ఐలమ్మ విగ్రహం

ఒకరు ఆధ్యాత్మిక వేత్త, మరొకరు భూమి కోసం.. భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి. అటువంటి వారి విగ్రహాలకు ఎన్నికల కోడ్ కారణంగా ముసుగులు వేయడం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఎన్నికలలో ప్రభావితం చేసే రాజకీయాలతో సంబంధం ఉన్న నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం సహజం. అయితే జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో స్వామి వివేకానంద, చాకలి ఐలమ్మల విగ్రహాలకు ముసుగులు వేయడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. వీరిద్దరికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయాలతో సంబంధం లేదన్నది జగమెరిగిన సత్యం. స్వామి వివేకానంద దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్‌లలో యోగా, వేదాంత శాస్త్రాల గురించి తన ఉపన్యాసాల ద్వారా ప్రభావితం చేసిన మహనీయుడు. అందుకే ఆయన విగ్రహాన్ని సంగారెడ్డి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేశారు. ఇక తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి ఇచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ. అందుకే ఆమె విగ్రహాన్ని కలెక్టరేట్ సమీపంలో నెలకొల్పారు. ఇప్పుడు వీరిద్దరి విగ్రహాలకు ముసుగులేయడం ఏమిటో అధికారులకే తెలియాలి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి



స్వామి వివేకానంద విగ్రహం

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

● మెదక్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 18: సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని మెదక్ పార్లమెంట్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎస్పీ బాలస్వామితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వెలువడుతుందన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న పరిశీలన, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని వివరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, ఎస్పీ బాలస్వామి

ఏప్రిల్ 15వరకూ ఓటరు నమోదు

మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్, అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు సరిచూసుకోవాలని, జాబితాలో పేరులేనివారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం 18,12,858 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకప్ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. రాజకీయపార్టీల నేతలకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లాలో బృందాలను, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజలు 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చునన్నారు. ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు, మద్యం సరఫరా జరగకుండా 24 గంటలపాటు గట్టి నిఘా ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. ఇందుకోసం జిల్లాలో అవసరమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు రూ. 50వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ఒకవేళ డబ్బు పట్టుబడితే అందుకు సంబంధించిన సరైన పత్రాలను చూపించాల్సి ఉంటుందని సూచించారు.

నిబంధనలు పాటించాలి

మెదక్ అర్బన్, మార్చి18: ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి రూ.95 లక్షల వరకు ఖర్చు పరిమితి ఉందన్నారు. ఎన్నికల ప్రచార ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు 72 గంటల ముందస్తు దరఖాస్తు చేసుకొని సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్, ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, ఎన్నికల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా: ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి18: పార్లమెంట్ ఎన్నికలకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పోలీసు అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పని చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసుకొని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. అయుధ లైసెన్స్ కలిగిన వారు డిపాజిట్ చేయించాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంజీవన్‌రావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌కు

అవిశ్వాసం సెగ

● నోటీసు అందించిన పది మంది డైరెక్టర్లు



ఊర్మిళరాంరెడ్డి, చైర్‌పర్సన్

నారాయణఖేడ్, మార్చి 18: మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట ప్రాథమిక సహకార సంఘం(సీడెడ్)సొసైటీ చైర్‌పర్సన్‌కు అవిశ్వాసం సెగ తగిలింది. సంజీవన్‌రావుపేట ప్రాథమిక సహకార సంఘానికి నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో 13 మంది డైరెక్టర్లకు గాను 8 మంది బీఆర్ఎస్‌పార్టీకి చెందిన వారు, 5 మంది కాంగ్రెస్ పార్టీకిచెందిన వారు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. దీంతో అప్పట్లో బీఆర్ఎస్‌పార్టీకి చెందిన ఊర్మిళరాంరెడ్డి చైర్‌పర్సన్‌గా, రాములు వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్‌పార్టీ డైరెక్టర్ల మద్దతుతో ఎన్నికయ్యారు. కొద్ది రోజుల క్రితం వైస్ చైర్మన్‌రాములు, డైరెక్టర్లు బాలయ్య, దేవిసింగ్‌లు చనిపోయారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తోడు నారాయణఖేడ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు సంజీవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బుజ్జం కిషన్, సుశీల, బీఆర్ఎస్ డైరెక్టర్ శంకర్‌రావు, కిమ్యానాయక్ తదితరులు చైర్‌పర్సన్ ఊర్మిళరెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదపడం ప్రారంభించారు. వైస్ చైర్మన్, ఇరువురు డైరెక్టర్లు చనిపోవడంతో వారి స్థానంలో ముగ్గురిని కోఆప్షన్ సభ్యులుగా దినాకర్‌రావు, సుందరమ్మ, సతీష్‌లను ఎన్నుకున్నారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన శంకర్‌రావు, రుక్కమ్మ, సంజీవరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దినాకర్‌రావు, సుందరమ్మ, కిమ్యానాయక్, సుశీల, కిషన్, తదితరులు కలిసి అవిశ్వాసం నోటీసును ఇటీవల జిల్లా సహకార అధికారికి, కలెక్టర్‌కు అందించారు. దీంతో ఏప్రిల్ 2న డైరెక్టర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాసంపై సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి డైరెక్టర్లకు సోమవారం నోటీసులు అందించారు. ఏదిఏమైనా పీఏసీఎస్ సంజీవన్‌రావుపేట చైర్మన్ ఊర్మిళరెడ్డికి అవిశ్వాసం సెగ తగిలిందని చెప్పవచ్చు.

జాతీయ సమైక్యతా శిబిరానికి 'తారా' విద్యార్థిని

సంగారెడ్డి అర్బన్, మార్చి 18 : జాతీయ సమైక్యతా శిబిరానికి సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర విద్యార్థిని ఎం.సింధు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హరియాణాలోని ఫరహాబాదులో ఈ నెల 12నుంచి 18 వ తేదీ వరకు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో సింధు పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమాలలో జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకువచ్చిందని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. తమ విద్యార్థిని జాతీయస్థాయిలో రాణించడం సంతోషంగా ఉందని ఆమెను అభినందించారు.

మామిడి తోటలను పరిశీలించిన ఉద్యానవనాధికారి



మామిడి పంట నష్టాన్ని పరిశీలిస్తున్న మండల ఉద్యానవనాధికారి

నిజాంపేట, మార్చి 18: ఇటీవల కురిసిన అకాలవర్షం, ఈదురు గాలులకు నష్టపోయిన మామిడి తోటలను మండల ఉద్యానవనాధికారి సంతోష్‌కుమార్ పరిశీలించారు. సోమవారం మండల పరిధిలోని నస్కల్, చల్మెడ నగరం గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించి, వాటిల్లిన నష్టాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఉద్యానవనాధికారి మాట్లాడుతూ మండలంలో మొత్తం 18 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన రైతుల వివరాలను, నష్టం అంచనాను సేకరించామని తెలిపారు. పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందజేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందే విధంగా కృషి చేస్తామని చెప్పారు.

నకిలీ క్రిమిసంహారక మందులతో పంట నష్టం

● పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారి, కంపెనీ ప్రతినిధులు



రంగు మారిన వరి పంట, బాధిత రైతుతో మాట్లాడుతున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

కొండపాక, మార్చి 18: వరి పంటకు పురుగుల మందు స్ప్రే చేస్తే పంట అంతా చెడిపోయిందని కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన రైతు సోమవారం ఆందోళనకు దిగాడు. దుద్దెడ గ్రామానికి చెందిన చిలుమల శ్రీనివాస్ అనే రైతు తన రెండెకరాల వరి పంటకు తెగులు సోకడంతో వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద గల పురుగుల మందు దుకాణం నుంచి క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసి పిచికారి చేశాడు. తెగులు నివారణ ఏమో గాని పంట మొత్తం ఎర్రగా మారి పూర్తిగా నష్టపోయానని ఆందోళనకు దిగాడు. దాంతో దుకాణ యజమాని సంబంధిత కంపెనీ వారిని రప్పించి రైతుతో మాట్లాడించారు. ఎర్రగా మారిన పంటలను వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శినితో పాటు కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. తమ కంపెనీ మందు స్ప్రే చేస్తే నష్టం కాలేదని, ఈ మందులో వేరే కంపెనీ గడ్డి మందు కలిపి స్ప్రే చేయడం వల్ల జరిగిందని వారు వివరించారు. అయినప్పటికీ శాంపిల్స్ తీసుకువెళ్లి నిర్ధారణ చేస్తామని, తమ కంపెనీ మందు వల్ల నష్టం జరిగితే పరిహారం అందిస్తామని కంపెనీ నిర్వాహకులు తెలపడంతో బాధిత రైతు ఆందోళన విరమించారు.


ఎంఈవో చొరవతో 'పది' పరీక్షలకు హాజరైన విద్యార్థిని



విద్యార్థినికి రూపకు హాల్ టిక్కెట్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

పుల్‌కల్, మార్చి 18: మండల విద్యా శాఖాధికారి దండు అంజయ్య చొరవతో ఓ విద్యార్థిని పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరైంది. మండలంలోని మంతూరు గ్రామానికి చెందిన రూప పుల్కల్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, రూప 17వ తేదీ వరకు హాల్ టికెట్ తీసుకోలేదు. అప్పటికే రూప స్వగ్రామమైన మంతూరుకు వెళ్లి తల్లిదండ్రుల వద్ద ఉంటూ కూలీ పనులకు వెళ్తున్నది. పరీక్షలు సమీపించిన తరుణంలో పాఠశాలలో రూప మాత్రమే హాల్ టికెట్ తీసుకోలేదన్న విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈవో దండు అంజయ్య దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం మంతూరు గ్రామానికి వెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ పరీక్షలకు హాజరయ్యేందుకు నిరాకరించడంతో విద్యా హక్కు చట్టం గురించి వివరిస్తూ తల్లిదండ్రులపై పోలీసు కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఎట్టకేలకు అంగీకరించిన తల్లిదండ్రులు కస్తూర్బా గాంధీ పాఠశాలకు ఆదివారం సాయంత్రం రావడంతో హాల్ టికెట్‌ను అందజేశారు. దీంతో రూప సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు హాజరైంది. ఎంఈవో దండు అంజయ్య చూపిన చొరవను పలువురు అభినందించారు. ఈ విషయమై ఎంఈవో మాట్లాడుతూ ఓ చిన్న ప్రయత్నం బాలిక జీవితాన్నే మార్చవచ్చని ఆకాంక్షించారు.

పోలీసుల తనిఖీలో రూ.2.80 లక్షలు పట్టివేత



డబ్బును స్వాధీనం చేసుకుంటున్నఎస్ఐ

కల్హేర్, మార్చి 18: మండల పరిధిలోని కల్హేర్, మాసాన్‌పల్లి గ్రామాల మధ్య పోలీసుల తనిఖీలో రూ.2.80 నగదు పట్టుబడినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపారు. సోమవారం సాయంత్రం తమ సిబ్బందితో కల్హేర్, మాసాన్‌పల్లి రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన చీనూరి కుబేర్‌కుమార్ అనే వ్యక్తి సరైన పత్రాలు లేకుండా తన ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.2.80లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును సంగారెడ్డిలోని గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేశామన్నారు. సరైన పత్రాలు సమర్పిస్తే నగదును అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరూ రూ. 50 వేలకు మించి నగదును తరలించరాదని, తప్పనిసరైతే సరైన ఆధారాలు చూపాలని సూచించారు.

ఓఆర్ఆర్‌పై కారు ఢీకొని మరో కారు బోల్తా

శంషాబాద్ రూరల్, మార్చి 18: శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ కారు మరో కారును ఢీకొన్న ఘటనలో ముందు వెళ్తున్న కారు బోల్తా పడింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బీరంగూడకు చెందిన శివరాత్రి వెంకన్న తన బ్రిజా (టీఎస్14 ఈఎక్స్8762) కారులో సూర్యాపేట నుంచి పటాన్‌చెరుకు బయలుదేరాడు. ఓఆర్ఆర్‌పై మార్గమధ్యలో పెద్దగోల్కొండ వద్దకు చేరుకోగానే వెనక నుంచి వచ్చిన ఎస్‌క్రాస్ (ఏపీ 39 కేకే 2033) కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ముందున్న వెంకన్న కారు బోల్తా కొట్టింది. అయితే కార్లలో ఉన్న ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్ సందీప్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ అవినీతి

● సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

చేర్యాల, మార్చి 18: ఎలక్టోర్ బాండ్ల పేరిట బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల నుంచి అక్రమంగా పోగుసుకుందని, ఆ అవినీతి సొమ్ము వెదజల్లి మళ్లీ అధికారంలోకి రావాలని కుయుక్తులు పన్నుతుందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని వాసవీగార్డెన్స్‌లో నిర్వహించిన చేర్యాల, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేది మరోటిలా ఉందన్నారు. ఎలక్టోరల్‌బాండ్ల రూపంలో వచ్చిన నిధులను వెల్లడించకుండా రాజ్యాంగబద్ధ వ్యవస్థలను నిర్వీర్యం చేసి కేంద్రం గుప్పిట్లో పెట్టుకుని ప్రజావ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థతో కూడుకున్న దేశంలో కులం, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలు చెల్లవన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం నిధులను ఇవ్వకుండా రాష్ట్రాల హక్కులను హరించడమే కాకుండా ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేయిస్తుందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను వంచించిందన్నారు. బీజేపీ పాలనలో ఆకలిచావులు పెరిగిపోయాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో సీపీఎం పోటీ చేస్తుందని, సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు నక్కల యాదవరెడ్డి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు సీతారాములు

ప్రశాంతంగా పది పరీక్షలు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పలు కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని వారు తెలిపారు.

జహీరాబాద్, మార్చి 18: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో 16పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి బస్వరాజ్ తెలిపారు. రెండు మండలాల్లో 2,830 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 2,826 మంది విద్యార్థులు హాజరయ్యారు.

● **కౌడిపల్లి:** మండల కేంద్రలోని పరీక్షా కేంద్రాన్ని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ తనిఖీ చేశారు.

● **చిన్నశంకరంపేట:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, హైస్కూల్, మిర్జాపల్లిలోని పరీక్షా కేంద్రాలను మెదక్ డీఈవో రాధకిషన్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు.



చిలప్‌చెడ్‌లో పరీక్షా కేంద్రంలోకి వెళ్తూ..

● **నర్సాపూర్:** నర్సాపూర్‌లోని ఆరు కేంద్రాల్లో 975 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 967 మంది హాజరైనట్లు ఎంఈవో బుచ్యానాయక్ తెలిపారు.

● **జిన్నారం:** జిన్నారంలో రెండు, బొల్లారం మున్సిపాలిటీలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 924 మందికిగానూ ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

● **హత్నూర:** మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 894 మంది విద్యార్థులకుగానూ 892 మంది హాజరయ్యారు.

● **అల్లాదుర్గం:** మండలంలోని గడిపెద్దాపూర్ పరీక్షా కేంద్రంలో 89 మంది విద్యార్థులకుగానూ 89, అల్లాదుర్గంలోని పరీక్షా కేంద్రంలో 126 మంది విద్యార్థులకుగానూ 126 మంది విద్యార్థులు హాజరయినట్లు అధికారులు తెలిపారు.

● **నిజాంపేట:** మండలంలో 175 మంది విద్యార్థులకు అందరూ హాజరై పరీక్షలు రాశారు.

● **రేగోడు:** మండలంలో 179 మంది విద్యార్థులకుగాను 177 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రేగోడులోని పరీక్షా కేంద్రాన్ని అల్లాదుర్గం సీఐ రేణుక తనిఖీ చేశారు.

● **వెల్దుర్తి:** మండలంలో వెల్దుర్తి, కుకునూర్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వెల్దుర్తిలో 130 మంది విద్యార్థులు, కుకునూర్‌లో 195 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయినట్లు సీఎస్‌లు సీతారాం, సాంబయ్య తెలిపారు.

● **మనోహరాబాద్:** మనోహరాబాద్ ఉన్నత పాఠశాల, కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాళ్లకల్‌లో 165 మందికీ అందరూ హాజరయ్యారు.



రంజోల్ బాలికల గురుకుల కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

● **హవేళిఘణపూర్:** మండలంలో సర్దన, భూర్గుపల్లి, హవేళిఘణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మహాత్మా జ్యోతిరావుఫూలే బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● **రామచంద్రాపురం:** మండల పరిధిలో 1,465 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో జమినీకుమారి తెలిపారు.

● **నాగల్‌గిద్ద:** నాగల్‌గిద్ద జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 243 మంది విద్యార్థులకు 243 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్ రమేష్, డిపార్ట్‌మెంట్ అధికారి రవీందర్ తెలిపారు. ఎస్ఐ సిద్ధిరాములు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

● **రామాయంపేట:** మండలంలోని మొత్తం ఐదు సెంటర్లలో 787 మందికి ఒక్కరు గైర్హాజరయ్యారు.

● **కొల్చారం:** మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 586 మందికి అందరూ హజరయ్యారు. ఎస్ఐ మహ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● **పెద్దశంకరంపేట:** పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు వందశాతం విద్యార్థులు హాజరయ్యారు. చీఫ్ సూపరిండెంట్‌లుగా వెంకటేశం, జీ.రవి వ్యవహరించగా, ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



మనోహరాబాద్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

● **మనూరు:** మండలంలో 246 మంది విద్యార్థులకు అందరూ పరీక్షలకు హాజరయ్యారు.

● **చిలప్‌చెడ్:** చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో 131 మందికి అందరూ హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ షైపసుద్దీన్ తెలిపారు.

● **చేగుంట:** నార్సింగ్ మండలంలో పరీక్షా కేంద్రాన్ని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి పరిశీలించారు. 113 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారు. చేగుంట మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 747 మందికి అందరూ హాజరయ్యారు.

● **కంది:** మండలంలోని మూడు పరీక్షాకేంద్రాల్లో 468 మందికి 468 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటనర్సింలు తెలిపారు.

● **గుమ్మడిదల:** గుమ్మడిదలలో 260 మంది, బొంతపల్లిలో 240మందికి అందరూ పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ గంగాభవాని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

సింగూరు కుడి కాల్వ ద్వారా సాగునీరివ్వండి



ఇరిగేషన్ ఎస్ఈకి వినతిపత్రాన్నిఅందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 18: సింగూరు కుడి కాల్వ ద్వారా రైతులకు సాగునీరివ్వాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీధర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ప్రాజెక్టును ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా నీళ్లు ఇవ్వకుండా అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యలను నివారించేందుకు సాగునీరు తప్పకుండా అందించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3,750 ఎకరాలకు కుడికాల్వ ద్వారా సాగునీరు అందించాల్సి ఉన్నా అధికారులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరందివ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, మహేష్, రవి ఉన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా పశువులకు టీకాలు

వట్‌పల్లి/వెల్దుర్తి, మార్చి 18: పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా గాలికుంటు టీకాలను వేశారు. సోమవారం వట్‌పల్లి మండలంలోని గౌతాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశు వైద్యాధికారి పాండ్యన్ ఆధ్వర్యంలో వేశారు. వెల్దుర్తి మండల పరిధిలోని శేరి, ఉప్పులింగాపూర్ గ్రామాల్లో 380 పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి ఫజాల్ ఆధ్వర్యంలో వేశారు. పశువులకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

కూచారం వివాహిత అదృశ్యం

మనోహరాబాద్, మార్చి 18: మండలంలోని కూచారం గ్రామానికి చెందిన వివాహిత నందిని(25) శనివారం నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కరణాకర్‌రెడ్డి తెలిపారు. కూచారం గ్రామానికి చెందిన నందినిని సుమారు మూడు నెలల క్రితం బిజిలిపురం గ్రామానికి చెందిన ఉపేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నందిని 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. ఈ క్రమంలో శనివారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా మల్లన్న స్వామి కల్యాణం



మనోహరాబాద్ మల్లన్న ఆలయం వద్ద బోనాల ఊరేగింపు

మనోహరాబాద్, మార్చి 18: మనోహరాబాద్ మండల కేంద్రంలోని మ్లలకార్జున స్వామి ఆలయ ఉత్సవాలు రెండు రోజుల నుంచి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సోమవారం కేతకీ భ్రమరాంబ సహిత మల్లన్న స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండాలు, బోనాల ఊరేగేంపు తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సోములు యాదవ్, మహిపాల్ యాదవ్, మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, అనిల్, సతీష్, ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

నందగోకుల్ గ్రామంలో..



మల్లన్న స్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

నిజాంపేట: మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గల ఆలయంలో మల్లికార్జున స్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఉడేపురాజయ్య, శ్రీశైలం, దేవయ్య, యాదయ్య, శ్రీనివాస్, మల్లయ్య, శ్రీకాంత్, మహేష్, ప్రశాంత్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో

గుమ్మడిదల: గుమ్మడిదల మండల కేంద్రంలోని మల్లన్న స్వామి ఆలయంలో సోమవారం కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు పాల సత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

హత్నూర/శివ్వంపేట, మార్చి 18: మండల పరిధిలోని తుర్కలఖానాపూర్ (తాహేర్‌ఖాన్‌పేట్) గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి సాయిబాబా కీర్తనలు, కాగడ హారతి అభిషేకం, పల్లకీ సేవ వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం హారతి కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వావిలాల నర్సింహులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శివ్వంపేట మండలంలోని గుండ్లపల్లిలో నిర్వహించిన మల్లన్న జాతరలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, రమణాగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

మెదక్ అర్బన్, మార్చి 18: ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలతో వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు ప్రజావాణికీ వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు అర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ఆత్మరక్షణ కోసం కరాటే అవసరం

చిన్నశంకరంపేట, మార్చి 18: ఆత్మరక్షణకు కోసం కరాటే అవసరమని హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట హైస్కూల్‌లో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ సెల్ఫ్ డిఫెన్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ నిర్వహించారు. సోమవారం శిక్షణ పూర్తయిన విద్యార్థినులకు ఎల్లో బెల్ట్‌లను, సర్టిఫికెట్లను హెచ్‌ఎం శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ నాగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్రవాహనం, ఒకరి మృతి

కొల్చారం, మార్చి 18: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టగా ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలైన సంఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. హైదారాబాద్ ప్రాంతానికి చెందిన ఆసిఫ్, అజిత్, మస్కాన్ ద్విచక్రవాహనంపై మెదక్ నుంచి నర్సాపూర్ వైపు వెళ్తుండగా కిష్టాపూర్ సమీపంలో అదుపు తప్పి కల్వర్టు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెనకాల కూర్చున్న అజిత్ తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు. మధ్యలో కూర్చున్న మస్కాన్‌కు రెండు కాళ్లు విరుగగా, వాహనాన్ని నడుపుతున్న ఆసిఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడిపిన ఆసిఫ్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి బంధువు సమీర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపారు.

అక్రమ కలప పట్టివేత..

రూ.50వేల జరిమానా

శివ్వంపేట, మార్చి 18: నిబంధనలకు విరుద్ధంగా మండల పరిధిలోని భీమ్లా తండాలో నీలగిరి ప్లాంటేషన్‌లో చెట్లను నరికి, కలపను తరలిస్తున్న వ్యక్తులను, డీసీఎంను అదుపులోకి తీసుకుని, జరిమానా విధించినట్లు తూప్రాన్ ఎఫ్ఆర్‌వో మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. శివ్వంపేట మండలం భీమ్లా తండా పరిధిలో నీలగిరి ప్లాంటేషన్‌లో రాత్రి సమయాల్లో చెట్లను నరికి తరలించడానికి యత్నిస్తుండగా సెక్షన్ ఆఫీసర్ కిరణ్, బీట్‌ఆఫీసర్‌తో కలిసి వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. అల్లీపూర్‌కు చెందిన విజయ్‌కు రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

రూ.60 వేల ఎల్వోసీ అందజేత

రామాయంపేట, మార్చి 18: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అండగా నిలిచారు. ధర్మారం గ్రామానికి చెందిన నక్కని దిలీప్ కుటుంబీకులకు సోమవారం రూ.60వేల ఎల్వోసీని కాంగ్రెస్ నేత ద్వారా అందజేశారు.

షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాలు సవరించాలి

సంగారెడ్డి రూరల్, మార్చి 18: షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనాలను సవరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం 73షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌కు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి, రెండు నెలల్లోగా సూచనలు, అభ్యంతరాలు పంపాలని కోరిందన్నారు. జిల్లా కమిటీ నుంచి అభ్యంతరాలు, సూచనలు పంపుతున్నామని వాటిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.28,223గా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనవెంట సీయూటీ జిల్లా కోశాధికారి రాజయ్య, నాయకులు బాబురావు, ప్రసన్న, దయానంద్ ఉన్నారు.

నేడు అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశం

అల్లాదుర్గం, మార్చి 18: అల్లాదుర్గం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్‌యాదవ్ సోమవారం తెలిపారు. ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక స్త్రీశక్తి భవన్‌లో నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

22 నుంచి మెదక్ జడ్పీస్థాయి సంఘ సమావేశాలు

మెదక్ అర్బన్, మార్చి 18: ఈ నెల 22 నుంచి జడ్పీస్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా జడ్పీ స్థాయి సంఘ సమావేశాలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

'200 రోజులు పని కల్పించాలి'

సంగారెడ్డి రూరల్, మార్చి 18: ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. కొత్లాపూర్ గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి, కూలీలతో మాటాడి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలైనా ఉపాధి కూలీలకు పరికరాలు, టెంట్లు, మంచినీరు, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఉపాధి హామీ కూలీలకు బకాయి డబ్బులు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనవెంట గౌస్, గోపాల్, విఠల్, మాధవి, నారాయణ, అంజయ్య తదితరులు ఉన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

మునిపల్లి, మార్చి 18: మునిపల్లి మండలం బుదేరా గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ ఆరా తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఏప్రిల్ 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పిల్లలకు బొమ్మలతో బోధించాలి



సంగారెడ్డిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

సంగారెడ్డి రూరల్, మార్చి 18: పిల్లలకు బొమ్మలతో పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తే సునాయసంగా అర్థమవుతుందని జిల్లా సంక్షేమ శాఖాధికారిణి లలితకుమారి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కార్యాలయ ప్రాంగణలో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు, గర్భిణులకు, బాలింతలకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రేణుక, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ సౌమ్య, సహాయ సమన్వయకర్త నవీన్‌కుమార్, సూపర్‌వైజర్ జయలక్ష్మి, అజీం ప్రేమ్‌జీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతునేస్తం'

సంగారెడ్డి రూరల్, మార్చి 18: రైతులకు శాస్త్రవేత్తలతో సాగులో మెళకువలు, సూచనలు ఇచ్చేందుకు ఈ నెల 19వ తేది నుంచి 'రైతునేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదిక భవన్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు నేరుగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు రైతువేదికల ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బీరు పరిశ్రమలో రక్తదాన శిబిరం

పుల్‌కల్, మార్చి 18: చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని చార్మినార్ బీరు పరిశ్రమలో సీఐటీయూ యూనియన్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు విజయ్‌కుమార్, రామ్మోహన్‌రావు, రాజ్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బాగారెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, ఆఫీసర్ బేరర్లు నాగభూషణం, మల్లారెడ్డి, సత్యనారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎంపీవోపై దాడి చేసిన ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి





కొల్చారం, మునిపల్లి ఎంపీడీవో కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

● **ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్, నిరసన**

నర్సాపూర్, మార్చి 18: నాగర్‌కర్నూల్ జిల్లా కొండేరు ఎంపీవోపై దాడి చేసిన ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నభోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో మధులత, ఎంపీవో శ్రీనివాస్‌తో పాటు ఉద్యోగులు నిరసన తెలిపారు. దాడి చేసిన ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● మునిపల్లి: మునిపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంపీడీవో హరినందన్ రావు, సిబ్బంది రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు రాజు, నాగలక్ష్మి, అనిల్, రమేష్, వీరేశం, వాణి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌ఉన్నీసా, పంచాయతీ కార్యదర్శులు చక్రధర్, గౌసియా బేగం, మహేష్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

● కొల్చారం: మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మినర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, శ్రీనివాసులు, మహేష్, పోచయ్య, నాగరత్నం, రాజేందర్, స్వాతిప్రియ, మమత, సంధ్య, అరుంధతి, విఠల్, ఫణీంద్ర, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌ను నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తారా?

● **మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ నియామకంపై జిల్లా అధ్యక్షుడు నర్సింహులు ఫైర్**

హత్నూర, మార్చి 18: రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌ను నామినేటెడ్ పద్ధతిలో నియమించడం సరైనది కాదని ఆ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింహులు మండిపడ్డారు. సోమవారం దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణలో మత్స్య సహకార సంఘాల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని వాపోయారు. ప్రజాస్వామిక పద్ధతిలో సహకార చట్టాల ప్రకారం 33 జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, రాష్ట్రస్థాయి సమాఖ్య (ఫిషరీస్ ఫెడరేషన్)కు పాలక మండలిని ఎన్నుకోవాలని కోరారు. అన్ని జిల్లాల్లో పూర్తిస్థాయి కమిటీల ఏర్పాటుకు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, రాష్ట్రస్థాయి ఫెడరేషన్‌కు పాలక మండలికి ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్‌ను నియమించడం చట్టవిరుద్ధం అని అన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 6,300 మత్స్యశాఖ సంఘాలు ఉండగా.. అందులో ముదిరాజులకు చెందిన సంఘాలు 4,500 ఉన్నాయని అన్నారు. అత్యధిక సంఘాలు ఉన్న ముదిరాజులకు కాకుండా ఇతరులకు చైర్మన్ పదవిని కట్టబెట్టడం తగదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రాష్ట్ర చైర్మన్‌ను నియమించాలని ఆయన కోరారు.



దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న నర్సింహులు

ఆశీర్వదిస్తే జహీరాబాద్‌ను అభివృద్ధి చేస్తా



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

పెద్దశంకరంపేట, మార్చి 18: ప్రజలు ఆశీర్వదించి తనను జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని ఆరేపల్లిలో నిర్వహించిన బీరప్ప ఆలయ జాతరలో పాల్గొన్నారు. అనంతరం పెద్దశంకరంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎంపీగా పని చేసిన బీబీపాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను గెలిస్తే యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు రైతులకు సాగునీరు అందించేందుకు పని చేస్తానని పేర్కొన్నారు. ఆయనవెంట ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీలు దత్తు, స్వప్నరాజేశ్వర్, మాజీ సర్పంచులు, నాయకులు ఉన్నారు.

రూ.30.90లక్షలకు తైబజార్ వేలం

తూప్రాన్, మార్చి 18: తూప్రాన్ మున్సిపాలిటీలో 2024-25 సంవత్సరానికి గానూ సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తైబజార్, పశువుల సంతకు వేలంపాటలు నిర్వహించారు. తైబజార్‌ను తుమ్మల గణేష్ రూ.28.50 లక్షలకు దక్కించుకున్నారు. పశువుల సంతను ఎండీ జాఫర్ రూ.2.40 లక్షలకు దక్కించుకున్నారు. దీంతో రూ.30.90 లక్షల ఆదాయం సమకూరినట్లు కమిషనర్ కాజా మొయిజుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ రఘువరన్, దుర్గయ్య పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత చెప్పులు..



తనపట్ల అభిమానం చూపిన నర్సింహులుకు కృతజ్ఞతలు చెబుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, మార్చి 18: పదేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్‌కు చెందిన నర్సింహులు అభిమాన నాయకురాలు సునీతారెడ్డి ఓడిపోయారు. ఆమె ఎమ్మెల్యేగా గెలిచే వరకు చెప్పులు వేసుకోనంటూ అప్పట్లో ఆయన శపథం చేశాడు. పదేళ్లుగా చెప్పులు లేకుండానే తిరిగారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన సునీతారెడ్డి సోమవారం ఏదుల్లాపూర్‌కు వెళ్లి, నర్సింహులును కలిశారు. ఆమె సూచనతో చెప్పులు వేసుకున్నారు. తనపట్ల ఇంతటి అభిమానం చూపిన నర్సింహులును ఎమ్మెల్యే సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

● **అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు**

నర్సాపూర్, మార్చి 18: పార్లమెంటు ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని నర్సాపూర్ ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జయప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని 9 మండలాల్లో మొత్తం 307 పోలింగు కేంద్రాలుండగా 2,26,154 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో కార్యదర్శులు నిబంధనలు ఉల్లఘించకుండా పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో మూడు ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు.



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో రాజు

● జహీరాబాద్: ఆర్డీవో కార్యాలయంలో ఎఫ్ఎస్టీ, ఎఎస్ఎస్టీ, ఆయా మండలాల తహసీల్దార్లతో జహీరాబాద్ ఆర్డీవో రాజు సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు విధులను నిర్వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు రవీందర్, సంజీవరావు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో ఎన్నికలు

జహీరాబాద్: పట్టణంలోని మహీంద్రా గెస్ట్‌హౌజ్‌లో కర్ణాటకలోని బీదర్ జిల్లా, జహీరాబాద్ పోలీసులతో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు సమావేశం నిర్వహించారు. కర్ణాటక, తెలంగాణ పోలీసులు పరస్పరంగా సహకరించుకుంటే ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని ఆయన పేర్కొన్నారు. బీదర్, చించోళి, హుమ్నాబాద్, ఉస్మానాబాద్ ప్రాంతాలకు చెందిన పోలీసులు ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరారు. సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎన్నికల కోడ్ ఉన్నా సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీని తొలగించలేదు. ఈ విషయాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించగా అధికారులు స్పందించి, తొలగించారు.
- సంగారెడ్డి రూరల్, మార్చి, 18